


నేడు బొబ్బిలి నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్ష

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి అధ్యక్షతన సమావేశం
- హాజరుకానున్న మంత్రి బొత్స

ప్రజాశక్తి-విజయనగరం

బొబ్బిలి అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశం శనివారం ఉదయం 10.30 గంటలకు కలెక్టర్ కార్యాలయ ఆడిటోరియంలో జరుగుతుందని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అధ్యక్షతన జరిగే సమావేశంలో జిల్లా మంత్రి బొత్స సత్యనారాయణ, బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు, జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపి బెల్లాన చంద్రశేఖర్ తదితరులు పాల్గొంటారని తెలిపారు. అన్ని ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులతోపాటు, నియోజకవర్గంలోని వివిధ మండలాలు, మున్సిపాలిటీ అధికారులు ఈ సమావేశానికి హాజరవుతారు.

సత్య బయోఫ్యూయల్స్‌కు భూమి కేటాయింపుపై చర్చ

- కారుచౌకగా కట్టబెడతారా? అంటూ ప్రశ్నలు
- ఇది అధికార దుర్వినియోగమేనంటూ విమర్శలు
- మంత్రి బొత్స ఎలా సమర్థించుకుంటారో..?
- భూముల దోపిడీపై ముందే పసిగట్టిన 'ప్రజాశక్తి'



భూముల కేటాయింపులపై సమావేశాల గురించి జులై 30న ప్రజాశక్తిలో వచ్చిన కథనం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

బొబ్బిలిలోని ఎపిఐఐసి గ్రోత్ సెంటర్లో మంత్రి బొత్స సత్యనారాయణ కుటుంబానికి చెందిన సత్య బయోఫ్యూయల్స్ ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీకి 30 ఎకరాల భూమిని కారుచౌకగా కట్టబెట్టడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. టిడిపి విజయనగరం పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు కిమిడి నాగార్జున స్పందిస్తూ శుక్రవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ప్రభుత్వ జిఒను రద్దుచేయాలంటూ ప్రకటనలో డిమాండ్ చేశారు. చిత్తశుద్ధి ఉంటే వాస్తవిక ధరలకు భూములు కేటాయించి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరిగే పరిశ్రమలు ఏర్పాటు చేయాలని సూచించారు. అధికార యంత్రాంగం దాటవేత ధోరణి ఆధారంగా భూముల కేటాయింపులో మతలబులు జరుగుతున్నట్టు ప్రజాశక్తి ముందే గుర్తించింది. జనం కూడా అనుమానించారు. ఈనేపథ్యంలో 'పరిశ్రమలు ఎక్కడ? భూములు ఎవరికి' అన్న పబ్లిక్‌టాక్ ప్రచురించిన సంగతి తెలిసిందే. సరిగ్గా 20 రోజుల వ్యవధిలో అడ్డగోలుగా భూములు కేటాయించినట్టు వెలుగులోకి వచ్చింది. బొబ్బిలి గ్రోత్‌సెంటర్‌లో ఎపిఐఐసి లెక్కల ప్రకారం ఎకరం ధర రూ.81.93 లక్షల వరకు ఉంది. ఇటువంటి భూమిని ఎకరా రూ.10 లక్షల చొప్పున బొత్స సోదరులు సతీష్ కుమార్, ఆదినారాయణ డైరెక్టర్లుగా ఉన్న కంపెనీకి ప్రభుత్వం కేటాయించిందని టిడిపి, సిపిఎం నాయకులు విమర్శించారు. బొబ్బిలి గ్రోత్ సెంటరుకు చుట్టుపక్కల బహిరంగ మార్కెట్లో ఎకరం భూమి ధర రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్ల వరకు ఉంది. దీన్ని బట్టి సుమారు రూ.22 కోట్ల మేర బొత్స కుటుంబానికి అనుచిత లబ్ధిచేర్చారని జనం చర్చించుకుంటున్నారు. ఈ భూమిలో డిస్టిలరీ, ఇథైల్ ఎసిటేట్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తారు. మద్యం ఉత్పత్తిలోనూ, ఫార్మా తదితర పరిశ్రమల్లోనూ ఉపయోగించే ఇథనాల్ ఇక్కడ తయారు చేస్తారని సమాచారం. ఈ భూముల కేటాయింపుకు సంబంధించి ఆగమేఘాలపై ఫైలు నడిచింది. వాస్తవానికి జిల్లా పారిశ్రామికంగా వెనుకబడి ఉంది. ఈనేపథ్యంలో పరిశ్రమలు, పెట్టుబడులను ప్రోత్సహించడంలో తప్పులేదు. కానీ, అత్యంత కారుచౌకగా ఈ మంత్రి కుటుంబీకుల పేరున ఏర్పాటు చేయబోయే పరిశ్రమకు ధారాదత్తం చేయడం చర్చనీయాంశంగా మారింది. దీంతో, మంత్రి తన అధికారాన్ని అడ్డం పెట్టుకున్నారని కొందరు, ముఖ్యమంత్రి ఎన్నికలకు ముందు మంత్రులు, ఎమ్మెల్యేలకు ప్రజల ఆస్తులను వివిధ రూపాల్లో ధారాదత్తం చేస్తున్నారని మరికొందరు వ్యాఖ్యానిస్తున్నారు. అందువల్లే జిల్లాలో జరిగిన పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక సమావేశంలో పరిశ్రమలకు భూముల కేటాయింపు మినహా, వాటిని ఎవరు? ఎక్కడ ఏర్పాటు చేస్తారు? ఎంతెంత? భూమి కేటాయిస్తారనేది స్పష్టం చేయలేదు. ఈనేపథ్యంలో జనంలో సాగిన చర్చను ప్రజాశక్తి ప్రతిబింబించింది. నేడు అదే నిజమని తేలింది. ఇంకా ఎక్కడెక్కడ ఎంతమందికి కేటాయించారో? అంటూ పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

30న 5లక్షల గృహప్రవేశాలు

- జిల్లాలో 36 వేల ఇళ్లను ప్రారంభానికి సిద్ధం చేయాలి
- బొబ్బిలిలో జిల్లా స్థాయి గృహప్రవేశ కార్యక్రమం
- గృహనిర్మాణశాఖ ప్రత్యేక కార్యదర్శి బిఎం దివాన్



సమావేశంలో మాట్లాడుతున్న గృహనిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి బిఎందివాన్

ప్రజాశక్తి-విజయనగరం

రాష్ట్ర వ్యాప్తంగా ఐదు లక్షల జగనన్న ఇళ్లలో ఈ నెల 30న సామూహిక గృహప్రవేశాలు జరగనున్నాయని గృహనిర్మాణశాఖ ప్రత్యేక కార్యదర్శి, జిల్లా ప్రత్యేకాధికారి బిఎం దివాన్ తెలిపారు. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమాన్ని సామర్లకోట వద్ద ముఖ్యమంత్రి జగన్ మోహనరెడ్డి ప్రారంభిస్తారని చెప్పారు. బిఎం దివాన్ జిల్లాలో శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ఆడిటోరియంలో సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ జిల్లాలో జగనన్న ఇళ్ల నిర్మాణ ప్రగతిని వివరించారు. జిల్లాలో తొలివిడత 36,030 ఇళ్ల నిర్మాణం లక్ష్యం కాగా, ఇప్పటివరకు సుమారు 34,050 ఇళ్ల నిర్మాణాలు పూర్తయినట్లు చెప్పారు. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. వాటిని ఈ నెలాఖరికి పూర్తి చేసి, ప్రారంభానికి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

అనంతరం బిఎం దివాన్ మాట్లాడుతూ జిల్లాలో బొబ్బిలి జగనన్న లే అవుట్‌లో జిల్లా స్థాయి ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. సామూహిక గృహ ప్రవేశాలకు మరో పది రోజులు మాత్రమే గడువు ఉందని, ఈలోగా ఇచ్చిన లక్ష్యాలకు అనుగుణంగా ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరారు. దీనికోసం రోజువారీ లక్ష్యాలను ఏర్పాటు చేసుకోవాలని, ప్రతిరోజూ కనీసం 300 ఇళ్ల స్టేజ్ అప్డేషన్ జరగాలని ఆదేశించారు. ఇసుక, సిమెంటు, ఐరన్ లభ్యతపై ఆరాతీశారు. గృహనిర్మాణానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, బిల్లులకు ఎక్కడా సమస్య లేదని చెప్పారు. ఈ నెలలో సుమారు రూ.900 కోట్ల బిల్లులు విడుదల కానున్నాయని తెలిపారు. కనీసం 25 పైబడి ఇళ్లున్న జగనన్న కాలనీకి స్వాగత ద్వారం నిర్మించాలని ఆదేశించారు. ప్రతిష్టాత్మకమైన పిఎంఎవై అవార్డు ఈసారి కూడా మన రాష్ట్రానికే రావాలని, అందుకు గృహనిర్మాణ శాఖ అధికారులు తమవంతు సహకారాన్ని అందించాలని కోరారు. ఈ వెరిఫికేషన్ బుధవారంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. వ్యక్తిగత మరుగుదొడ్లు, సోక్ పిట్స్ నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని దివాన్ సూచించారు. సమీక్షా సమావేశంలో జిల్లా గృహనిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వి.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

గృహ ప్రవేశాలకు సిద్ధం కావాలి



జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలపై ఆరాతీస్తున్న బిఎం దివాన్

బొబ్బిలి : ఐటిఐ కాలనీ సమీపంలో ఉన్న జగనన్న లేఅవుట్‌ను శుక్రవారం హౌసింగ్ ప్రత్యేక కార్యదర్శి బిఎం దివాన్ పరిశీలించారు. బొబ్బిలి లేఅవుట్‌ను వర్చువల్‌గా సిఎం జగన్మోహన్ రెడ్డి ప్రారంభిస్తారని ఆయన తెలిపారు. అప్పటికి జగనన్న లేఅవుట్లో మౌలిక సౌకర్యాలు పూర్తి చేసి సామూహిక గృహ ప్రవేశాలకు సిద్ధం కావాలని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు, హౌసింగ్ డిఇలు రత్నాకర్, అప్పయ్యకు సూచించారు. ఐటిఐ కాలనీ లేఅవుట్లో 200 ఇళ్లను సిద్ధం చేస్తున్నామని కమిషనర్ శ్రీనివాసరావు చెప్పారు. రోడ్లు, పైపులైన్ ఏర్పాటు కోసం రూ.27 లక్షలతో ప్రతిపాదనలు చేసినట్లు చెప్పారు. ఆర్చి నిర్మాణానికి రూ.5.50 లక్షలు మంజూరు చేస్తామని ప్రత్యేక కార్యదర్శి దివాన్ తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ పట్టణ ఎఇ ఎ.సూర్యనారాయణ పాల్గొన్నారు.

కమిషనర్ శ్రీనివాసరావుకు అభినందన

జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణం వేగవంతం చేసిన మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావును హౌసింగ్ ప్రత్యేక కార్యదర్శి బిఎం దివాన్ అభినందించారు. జిల్లాలో బొబ్బిలి మున్సిపాలిటీని ప్రథమ స్థానంలో నిలపడం ఎంతో ఆనందంగా ఉందని ఆయన చెప్పారు. ఇళ్ల నిర్మాణాలపై టీమ్ వర్క్ చేయడంతో మంచి ఫలితాలు సాధించామని శ్రీనివాసరావు తెలిపారు.



రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేస్తున్న విఎంఆర్‌డిఎ చైర్‌పర్సన్ విజయనిర్మల

ప్రజావసరాల మేరకు రోడ్ల విస్తరణ

విఎంఆర్‌డిఎ చైర్‌పర్సన్ విజయనిర్మల

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ప్రజావసరాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం పట్టణాల్లో రోడ్లు, ఇతర సౌకర్యాలను అభివృద్ధి చేస్తోందని విఎంఆర్‌డిఎ చైర్‌పర్సన్ ఎ.విజయనిర్మల అన్నారు. విఎంఆర్‌డిఎ నిధులు రూ.3.22 కోట్లతో నగరంలోని ఆర్అండ్‌బి కూడలి నుంచి పాల్‌నగర్ వరకు చేపట్టనున్న 1.03 కిలోమీటర్ల రోడ్డు విస్తరణ పనులకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామితో కలిసి శుక్రవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ రోడ్డు నిర్మాణం వల్ల ఐదు డివిజన్లతోపాటు పరిసర పది గ్రామాల ప్రజలకు కూడా ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. రోడ్డును రెండు లేన్ల బిటి రోడ్డుగా అభివృద్ధి చేసి మధ్యలో డివైడర్ ఏర్పాటు చేస్తామని, రోడ్డుకు ఇరువైపులా కాలువలు కూడా నిర్మిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో నగర మేయర్ వి.విజయలక్ష్మి, వైసిపి జోనల్ ఇన్‌ఛార్జి వి.ఎస్.ప్రసాద్, కార్పొరేటర్లు పిన్నింటి కళావతి, వి.ప్రభాకరరెడ్డి, తొగరోతు సంధ్యారాణి, దాసరి సత్యవతి, విఎంఆర్‌డిఎ ఎస్ఇ వి.భవానీ శంకర్, ఇఇ శ్యామ్‌ప్రసాదరావు, డిఇ కార్తీక, ఎఇ ప్రసాద్, మున్సిపల్ ఇంజినీర్ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

రోజుకో విధానం..

విద్యా వ్యవస్థకు విఘాతం

సెక్షన్‌కి 60 మంది విద్యార్థులతో నాణ్యమైన విద్య ఎలా సాధ్యం?

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విద్యా శాఖలో రోజుకొక విధానం అమలు వల్ల ప్రభుత్వ బడుల్లో చదువుతున్న విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. మొన్నటి వరకు 98 మంది విద్యార్థుల కంటే తక్కువ ఉన్న పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్లను హైస్కూల్‌కి సర్దుబాటు ప్రక్రియ ద్వారా పంపించారు. దీనివల్ల స్కూల్ అసిస్టెంట్లు లేకపోవడం వల్ల విద్యార్థులకు సరైన విద్య అందే అవకాశం లేదని చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రయివేటు స్కూళ్లలో చేర్పించారు. ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల్లో గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది చేరిన విద్యార్థుల సంఖ్య తగ్గుముఖం పట్టింది. మరోవైపు మరలా నేడు పని సర్దుబాటు పేరుతో స్కూల్ అసిస్టెంట్లను ప్రాథమికోన్నత పాఠశాలలకు పంపించే ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో రోజుకొక నిర్ణయంతో విద్యార్థులకు అన్యాయం జరగడంతోపాటు విద్యా సంవత్సరం మధ్యలో ఈ విధమైన మార్పులు చేయడం వల్ల ఉపాధ్యాయులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. విద్యా విధానంలో ఇటువంటి నిర్ణయాలు విద్యా వ్యవస్థకు తీవ్రమైన నష్టం కలిగించడం, ప్రయివేటు విద్యను ప్రోత్సహించడం తప్ప మరొకటి కాదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

సెక్షన్ ఆధారంగా పోస్టుల కేటాయింపు

విద్యాశాఖలో గతంలో సెక్షన్‌కి 40 మంది విద్యార్థులు ఉండేవారు. విద్యార్థుల సంఖ్యను బట్టి ఉపాధ్యాయ పోస్టుల కేటాయింపులు చేపట్టారు. నేడు అందుకు భిన్నంగా సెక్షన్ల బట్టి ఉపాధ్యాయుల కేటాయింపు చేయడం విద్యా వ్యవస్థకు తీవ్ర విఘాతం కలిగించే విధంగా ఉంది. నేడు 60 మంది విద్యార్థులను ఒక సెక్షన్‌గా చేయడం వల్ల ఉపాధ్యాయ పోస్టులు కుదించడంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య ఎలా అందుతుందనేది ప్రభుత్వమే చెప్పాల్సి ఉంది. దీనివల్ల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయడానికి ఆస్కారం లేకుండా పోతుంది. 6, 7, 8 తరగతులకు సెక్షన్‌కి 53 మంది విద్యార్థులుంటే ఒకే సబ్జెక్ట్ టీచర్‌ని ఇవ్వడం ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేయడం తప్ప మరొకటి కాదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ నిర్ణయం ఉపాధ్యాయ పోస్టులకు, విద్యార్థులకు నష్టం కలిగించే విధంగా ఉంది.



డిఇఒకు నోటీసు అందిస్తున్న ఫ్యాప్టో ప్రతినిధులు

నేడు డిఇఒ కార్యాలయం ఎదుట ధర్నా

పని సర్దుబాటు నిలిపేయాలని, జిఒ 117ను రద్దు చేయాలని, బదిలీలు, ఉద్యోగోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించాలని కోరుతూ శనివారం సాయంత్రం డిఇఒ కార్యాలయం వద్ద ధర్నా చేపడుతున్నట్లు ఫ్యాప్టో నాయకులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం డిఇఒను కలిసి, నోటీసు అందజేశారు. అనంతరం సెల్ఫ్ టెస్ట్ షెడ్యూల్ సవరించాలని, సిలబస్ పూర్తికావడానికి కావలసిన సమయం ఆధారంగా టెస్టుల షెడ్యూల్ ఉండాలని, టెస్ట్‌కు సంబంధించిన పేపర్లు అందరికీ అందుబాటులో స్కూల్ కాంప్లెక్స్‌లకు పంపించాలని విన్నవించారు.

నేడే పోలింగ్

- ఐదు పంచాయతీలు, ఎనిమిది వార్డులకు ఎన్నిక
- మధ్యాహ్నం కౌంటింగ్.. అనంతరం ఫలితాల వెల్లడి

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలోని ఐదు గ్రామ పంచాయతీల్లో శనివారం ఎన్నికలు జరగనున్నాయి. వీటితోపాటు మరో ఎనిమిది వార్డులకు కూడా పోలింగ్ జరగనుంది. సర్పంచులకు అన్నిచోట్లా ద్విముఖపోటీయే నెలకొంది. వార్డు మెంబర్‌కు జామి మండలం లొట్లపల్లి పంచాయతీ 10వ వార్డుకు త్రిముఖపోటీ నెలకొంది. మిగిలిన అన్ని చోట్లా ద్విముఖపోటీనే. పోలింగ్ ఉదయం 7 గంటలకు ప్రారంభం కానుంది. మధ్యాహ్నం 1 గంటలకు పోలింగ్ ముగిస్తారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి కౌంటింగ్ నిర్వహించి, అనంతరం ఫలితాలు వెల్లడించనున్నారు. అన్ని పంచాయతీలు, వార్డు సభ్యుల ఎన్నికకు ఇప్పటికే పోలింగ్ ఏర్పాట్లు పూర్తయ్యాయి. పోలీసు బందోబస్తు, పోలింగ్ అధికారులు శనివారం సాయంత్రానికే ఆయా గ్రామాలకు చేరుకున్నారు. బ్యాలెట్ బాక్సులతోపాటు, ఎన్నికల సామగ్రి ప్రత్యేక వాహనాల్లో తరలించారు.

ఇవీ పోలింగ్ జరగబోయే గ్రామాలు

జిల్లాలోని గంట్యాడ మండలం పిఎస్ఆర్ పురం, పూసపాటిరేగ మండలం కొప్పెర్ల, వంగర మండలం లక్ష్మింపేట, వోని అగ్రహారం, విజయనగరం మండలం పడాలపేట పంచాయతీలకు పోలింగ్ నిర్వహించనున్నారు. బాడంగి మండలం పాల్తేరులో 6వ వార్డు, బొబ్బిలి మండలం కొండదేవుపల్లిలో 2వ వార్డు, బొండపల్లి మండలం దేవుపల్లిలో 13 వార్డు, డెంకాడ మండలం డి.తాళ్లవలస 7వ వార్డు, గంట్యాడ మండలం పిఎస్ఆర్ పురం 2వ వార్డు, జామి మండలం లొట్లపల్లి 10వ వార్డు, వంగర మండలం రుషింగి 2వ వార్డు, విజయనగరం మండలం కొండకరకాం 9వ వార్డులకు పోలింగ్ నిర్వహించనున్నారు. ఎన్నికల ఏర్పాట్లు పూర్తిచేశామని అధికారులు తెలిపారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలపై వినతి

విజయనగరం టౌన్ : మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని శుక్రవారం విశాఖపట్నం మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ జి నాగరాజును ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర నాయకులు ఎ.జగన్మోహనరావు కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామతీర్థాలు, ముసిడిపల్లి, నెల్లిమర్ల మాస్టర్ పంప్ హౌస్ కార్మికులకు టర్న్‌కి సిస్టం రద్దుచేసి కార్పొరేషన్ కార్మికులుగా గుర్తించాలన్నారు. మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, ఇఎస్ఐ, పిఎఫ్ సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరారు. సరెండర్ లీవ్ డబ్బులు చెల్లించాలన్నారు. బకాయి హెల్త్ అలవెన్సు, విలీన ప్రాంత, ప్లాంటేషన్ కార్మికులకు బకాయి జీతాలు, సబ్బులు, నూనెలు, చెప్పులు, యూనిఫాం వంటి రక్షణ పరికరాలు ఇవ్వాలని కోరారు. పర్మినెంట్ కార్మికులకు సిపిఎస్ రద్దుచేసి ఒపిఎస్ అమలు చేయాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో బాబూరావు, లక్ష్మణరావు, చంద్రరావు, ప్రశాంత్, సూరి పైడితల్లి, రాజు, నీలా తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలపై 36 వినతులు

ప్రజాశక్తి-విజయనగరం

వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న, రెగ్యులర్, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు తమ సర్వీసు సంబంధిత సమస్యలపై అందజేసిన వినతులను చిత్తశుద్ధితో పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ జిల్లా అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలపై కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం ప్రత్యేక స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నుంచి జెసి వినతులను స్వీకరించారు. పలు ఉద్యోగ సంఘాల ప్రతినిధులు తమ సమస్యలపై వినతిపత్రాలు అందించగా, పలువురు ఉద్యోగులు వ్యక్తిగత సమస్యలకు సంబంధించి వినతులు అందించారు. ఉద్యోగులు అందించిన వినతులపై నేరుగా ఆయా జిల్లా అధికారులతో మాట్లాడి నిబంధనల మేరకు వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. ఆర్‌టిసిలో పనిచేస్తున్న పలువురు మహిళా ఉద్యోగులు తమకు రాత్రి వేళల్లో డ్యూటీలు వేయడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని విన్నవించారు. వారికి సాధ్యమైనంత మేరకు ఉదయం వేళల్లో డ్యూటీలు వేసి రాత్రి వేళల్లో యువ ఉద్యోగులకు డ్యూటీలు వేసే అంశం పరిశీలించాలని జిల్లా ప్రజారవాణా అధికారికి జెసి సూచించారు. నాలుగో తరగతి ఉద్యోగులకు నగదు రహిత వైద్యం, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని సంఘం అధ్యక్షుడు ఎం.గంగాప్రసాదరావు, కార్యదర్శి చందక శ్రీనివాసరావు తదితరులు వినతిపత్రం అందజేశారు. ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నుంచి స్పందనకు 36 వినతులు అందాయి. వీటిలో అత్యధికంగా వైద్య ఆరోగ్యశాఖ, మహిళా శిశు సంక్షేమశాఖ, గ్రామ వార్డు సచివా లయ శాఖ, ట్రెజరీ శాఖలకు సంబంధించి ఉన్నాయి. కార్యక్రమంలో డిఆర్ఓ ఎం.గణపతిరావు, ఖజానా అధికారి ఆర్.ఎ.ఎన్.కుమార్, బి.సి.సంక్షేమ అధికారి యశోధనరావు, ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయ అధికారి డాక్టర్ అప్పలరాజు, జిల్లా ప్రజా రవాణా అధికారి నారాయణ పాల్గొన్నారు.

ప్రభుత్వంపై అక్కసుతోనే అడ్డంకులు

హైదరాబాద్‌కు దీటుగా విశాఖలో రాజధాని : డిప్యూటీ స్పీకర్ కోలగట్ల



మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రభుత్వానికి మంచిపేరు వస్తుందనే అక్కసుతో అడ్డంకులు సృష్టిస్తున్నారని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి అన్నారు. శుక్రవారం విజయనగరంలోని తన నివాసం వద్ద నియోజకవర్గ జెసిఎస్ నమోదు శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయ కన్వీనర్లకు పార్టీ తరపున బీమా చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చంద్రబాబు రాజధాని అని చెబుతున్న అమరావతిలో సాయంత్రం 5గంటలు దాటితే టీ కూడా దొరకదని చెప్పారు. అమరావతిని చూసి భయపడిన పెట్టుబడిదారులు ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు సాహసించలేకపోయారని గుర్తుచేశారు. మరో హైదరాబాద్ మాదిరి విశాఖ అభివృద్ధి చెందగలదని తెలిపారు. ఇదే జరిగితే జగన్‌కు పేరు వస్తుందన్న అక్కసుతోనే ప్రతిపక్ష నాయకులు అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆరోపించారు. 2014లో జాబు కావాలంటే బాబు రావాలని, డ్వాక్రా మహిళల రుణాలు మాఫీ చేస్తానని నమ్మబలికిన చంద్రబాబు... వారందరినీ నిలువునా ముంచారని విమర్శించారు.

ఆస్తులను అమ్మిన చరిత్ర అశోక్‌ది

నియోజకవర్గంలో అభివృద్ధిపై విమర్శలు చేస్తున్న టిడిపి నాయకులు వాస్తవాలను తెలుసుకోవాలని కోలగట్ల హితవుపలికారు. అశోక్ హయాంలో 9 వేల గజాలున్న విలువైన ప్రదేశంలో ఆర్‌డిఒ కార్యాలయ స్థలాన్ని అమ్మారని.. సర్కస్ గ్రౌండ్, పాత బస్టాండ్ దగ్గర ఉన్న క్యాటిల్ డిపో, రింగ్ రోడ్‌లో డంపింగ్ యార్డ్ స్థలాలను సైతం విక్రయించారని తెలిపారు. వచ్చిన డబ్బులతో కోట చుట్టూ సుందరీకరణ, కోటలో మ్యూజియం అన్నారని.. నేడు అవి ఎక్కడ ఉన్నాయని ప్రశ్నించారు. తాను ప్రభుత్వ స్థలాలు అమ్మినట్లు నిరూపిస్తే శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేస్తానని స్పష్టం చేశారు. గతంలో అన్న క్యాంటీన్ల పేరుతో పేదలకు పెట్టే భోజనంలోనూ అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. కార్యక్రమంలో జెసిఎస్ కన్వీనర్లు ఆశపు వేణు, ఎస్‌వివి రాజేష్, సంగం రెడ్డి బంగారు నాయుడు, ముద్దాడ మధు, మేయర్ వి.విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, ముచ్చు లయ, తదితరులు పాల్గొన్నారు.

90 శాతం ఓటర్ల వెరిఫికేషన్ పూర్తి

ప్రజాశక్తి-విజయనగరం

ఇంటింటి ఓటర్ల జాబితా పరిశీలన 90 శాతం పూర్తయిందని, ఈ నెల 22లోగా మొత్తం పూర్తి చేస్తామని కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. శుక్రవారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముకేశ్ కుమార్ మీనా అన్ని జిల్లాల కలెక్టర్లతో ఓటర్ల జాబితా సవరణపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ బిఎల్ఒ యాప్‌లో 67 శాతం నమోదు జరిగిందని తెలిపారు. ఓటర్ల సవరణ ప్రక్రియలో భాగంగా కొత్తగా నమోదైన ఓటర్ల వివరాలను, డూప్లికేట్ ఓటర్లు, మరణించిన వారు, బదిలీ అయిన వారు తదితర ఓటర్ల వివరాలను నమోదు చేసినట్లు వివరించారు. ఈ నెల 22 లోగా శత శాతం వెరిఫికేషన్ పూర్తి చేస్తామన్నారు. ఈ సమావేశంలో జెసి మయూర్ అశోక్, డిఆర్ఒ గణపతిరావు, ఆర్‌డిఒలు సూర్యకళ, అప్పారావు, శేషశైలజ, ఎస్‌డిసిలు నూకరాజు, వెంకటేశ్వర రావు, సుదర్శన దొర, పద్మలత పాల్గొన్నారు.

సమగ్ర చట్టం చేయాలని ముఠా కళాసీల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్



ధర్నా చేస్తున్న ముఠా కళాసీలు

ముఠా కళాసీలకు సమగ్ర చట్టం చేయాలని కోరుతూ శుక్రవారం కలెక్టరేట్ వద్ద ముఠా కళాసీ సంఘం (సిఐటియు) ఆధ్వర్యాన ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా కార్యదర్శి బి.రమణ మాట్లాడుతూ లోడింగ్, అన్ లోడింగ్ సమయంలో కళాసీలు ప్రమాదానికి గురైతే ఆ కుటుంబం రోడ్డున పడుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. కానీ ప్రభుత్వం ఆదుకునే పరిస్థితి లేదన్నారు. ప్రమాద బీమా పథకం అమలు చేయడం లేదని చెప్పారు. ప్రమాద బీమా అమలు చేయాలని, 60 ఏళ్లు దాటిన వారు వృద్ధాప్యంలో పనిచేయలేకపోతే పింఛను ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ముఠా కళాసీలు రాజు, రమణ, తదితరులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో అందరి భాగస్వామ్యం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

దేశాభివృద్ధిలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి కోరారు. ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా అయ్యకోనేరు గట్టు ప్రాంతంలో మొక్కలు నాటారు. అమరజవాను రౌతు జగదీష్ స్మారకార్థం ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో చెరువులు, పార్కులు, జంక్షన్లను అభివృద్ధి చేశామన్నారు. అయ్యకోనేరును అందాల కోనేరుగా తీర్చిదిద్దామన్నారు. చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ నిర్మించామని చెప్పారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, సిఆర్‌పిఎఫ్ డిప్యూటీ కమాండెంట్ భగత్ సింగ్, కమిషనర్ శ్రీరాములునాయుడు, రౌతు సింహాచలం, సరస్వతి, రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి మండల డైరెక్టర్ బంగారునాయుడు, వైసిపి నాయకులు నాయన మహేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రులకు ఎసిలు వితరణ

ప్రజాశక్తి-విజయనగరం

నగరంలోని రెండు ఆస్పత్రులకు పది ఎసిలను యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సమకూర్చింది. ఈ మేరకు రూ.3.54 లక్షల వ్యయంతో కొనుగోలు చేసిన పది ఎసిలను ఆ బ్యాంకు ప్రాంతీయ హెడ్ పి.నరేష్ శుక్రవారం కలెక్టర్ ఎస్.నాగలక్ష్మికి కలెక్టర్ కార్యాలయంలో అందజేశారు. నగరంలోని ఘోషాసుపత్రికి ఐదు, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి ఐదు ఎసిలను అందజేయాలని కోరారు. తమ బ్యాంకు కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధుల నుంచి వీటిని అందజేశామని కలెక్టర్‌కు తెలిపారు. కార్యక్రమంలో ఎల్‌డిఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అభివృద్ధికి అధిక ప్రాధాన్యత : జెడ్‌పి చైర్మన్

ప్రజాశక్తి - కొత్తవలస

వైసిపి ప్రభుత్వంలో అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని రెల్లి గ్రామంలో సుమారు రూ.90 లక్షలతో నిర్మించిన మూడు నూతన భవనాలను జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు శుక్రవారం సాయంత్రం ప్రారంభించారు. అనంతరం రెల్లి గ్రామంలో సర్పంచ్ అల్లం సత్యన్నారాయణ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో రూ.90 లక్షల నిధులతో నిర్మించిన, సచివాలయం, హెల్త్ క్లినిక్ సెంటర్, వెల్ నెస్ సెంటర్ మూడు భవనాలను ఒకేసారి ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాల అమలు చేస్తుందని వాటన్నిటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారిన మన తలరాతలు మారలేదని, రాష్ట్రంలో వైఎస్ఆర్ ప్రభుత్వం వచ్చిన తర్వాత, మన పిల్లల భవిష్యత్తు మారిందని అన్నారు. రాష్ట్రంలో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు విజన్ 24 అని ప్రగల్భాల్ పలుకుతున్నారని వాటిని ఎన్నటికీ నమ్మరాదని చెప్పారు. ఈ కార్యక్రమంలో కొత్తవలస మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ మూకల కస్తూరి, ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ, పిఎసిఎస్ చైర్మన్ గొరపల్లి శివ, మండల పార్టీ అధ్యక్షుడు ఒబ్బిన నాయుడు, జెసిఎస్ మండల ఇంచార్జ్ బొంతుల వెంకటరావు, మేలస్త్రి అప్పారావు, గొరపల్లి రవి, మండల యువజన విభాగం అధ్యక్షుడు ఐతంశెట్టి అనిల్ కుమార్,



నూతన భవనాలను ప్రారంభిస్తున్న జెడ్‌పి చైర్మన్ శ్రీనివాసరావు, ఎమ్మెల్యే కడుబండి

పి ఎస్ ఎన్ పాత్రుడు, స్థానిక సర్పంచులు జోడు రాములమ్మ, అల్లం సత్యనారాయణ, ఎంపిటిసి ఉగ్గిన గురూజీ, ఉగ్గిన రాంబాబు, ఉగ్గిన పద్మనాభం, పల్లా భీష్మ, ఆదిరెడ్డి అప్పన్న, తుమ్మికాపల్లి సర్పంచ్ కొండలరావు, ఎండి నాయుడు, గనిశెట్టి పాలెం ఈశ్వరరావు, ఉత్తర పల్లి గణేష్, గోపిశెట్టి శ్రీనివాసరావు, వెంకన్న పాత్రుడు, జామి సాల్మన్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

విలేజ్ క్లినిక్‌లతో మెరుగైన వైద్య సేవలు

రామభద్రపురం: వైఎస్ఆర్ విలేజ్ క్లినిక్‌లతో గ్రామాల్లో మెరుగైన ఉచిత వైద్య సేవలు సాధ్యపడతాయని ఎమ్మెల్యే ఎస్‌వి చిన అప్పలనాయుడు అన్నారు. మండలంలోని గొల్లపేట, తారాపురం గ్రామాల్లో సుమారు రూ.40 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన వైఎస్ఆర్ విలేజ్ క్లినిక్ భవనాలను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ పేద ప్రజలకు సత్వర వైద్య సేవలు అందజేసే ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగనన్న ఈ విలేజ్ క్లినిక్‌లు ఏర్పాటుకు శ్రీకారం చుట్టారనీ వీటిని సద్వినియోగం చేసుకొని మెరుగైన వైద్య సేవలు పొందాలని సూచించారు. అనంతరం మండల కేంద్రం శివాలయం వద్ద కొత్తగా రూ.7లక్షల వ్యయంతో నిర్మించ తలపెట్టిన కల్వర్టు, డ్రైన్ నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి చొక్కాపు లక్ష్మణరావు, జెడ్‌పిటిసి అప్పికొండ సరస్వతి, సర్పంచ్ కడుపుకూటి రమ్య, ఎంపిటిసి శిష్ఠు రమణమ్మ, పిఎసిఎస్ అధ్యక్షుడు కిర్ల చంద్రశేఖర్, మండల జెసిఎస్ కన్వీనర్ చింతల సింహాచలం నాయుడు, వైసిపి నాయకులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రూ. 30వేలు అందజేత

బొబ్బిలి: తెర్లాం మండలంలోని నందిగాం గ్రామంలో మసీదు రిపేరు నిమిత్తం వాక్ఫ్ బోర్డు నుంచి రూ. 30వేలు చెక్కును ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన్నప్పలనాయుడు మసీదు కమిటీకి అందజేశారు. ఈ కార్యక్రమంలో బొబ్బిలి మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, సీనియర్ కౌన్సిలర్ పాలవలస ఉమా, జిల్లా మైనారిటీ సెల్ ప్రెసిడెంట్ అబ్దుల్ హమీద్ తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల వినియోగంతో అనర్థాలు



మాట్లాడుతున్న ఎస్‌పి దీపిక

డెంకాడ: మాదక ద్రవ్యాల వినియోగంతో తీవ్ర అనర్థాలు జరుగుతాయని జిల్లా ఎస్‌పి ఎం. దీపిక అన్నారు. స్థానిక ఎవిఎన్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులతో ఆమె శుక్రవారం సమావేశమై, మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను వివరించి, విద్యార్థుల బంగారు భవిష్యత్తును నాశనం చేసే మత్తు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. మాదక ద్రవ్యాల అలవాటు పడిన వ్యక్తులు వాటి నుండి బయట పడలేక, విచక్షణ కోల్పోయి నేరాలకు పాల్పడుతూ, భవిష్యత్తు నాశనం చేసుకొంటూ, తల్లిదండ్రులకు శోకాన్ని మిగులుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సెబ్ అదనపు ఎస్‌పి అస్మా ఫర్హీన్, సైకియాట్రిక్ హెచ్ఒడి డాక్టర్ మల్లిక, సైకియాట్రిక్ డాక్టర్ ఎస్.వి.రమణ, డ్రగ్ డీ అడిక్షన్ వైద్యులు డాక్టర్ హరీష్, ఎవిఎన్ సిఇ విజయనగర్, భోగాపురం సిఐ బి.వి.వెంకటేశ్వర రావు, డెంకాడ ఎస్ఐ యు.మహేష్, కళాశాల ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమ వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు

బొబ్బిలి: డ్వాక్రా రుణాలు మంజూరులో అక్రమ వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు హెచ్చరించారు. మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం మెప్మా పీడీ సుధాకర్ సమక్షంలో మెప్మా సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అక్రమ వసూళ్ల నేపథ్యంలో మెప్మా సిబ్బందిపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. సమావేశంలోకి మీడియాను అనుమతించలేదు. మున్సిపాలిటీలో డ్వాక్రా మహిళలకు ఇస్తున్న బ్యాంక్ లింకేజీ రుణాల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయన్నారు. అవినీతి ఆరోపణలు వస్తే ఎంతటివారినైనా క్షమించే పరిస్థితి లేదని చెప్పినట్లు తెలిసింది. మెప్మాలో సిఎంఎంగా పని చేస్తున్న రాముపై సిబ్బంది ఎమ్మెల్యే శంబంగికి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. రాము పని చేసిన చోట పని చేయడం కష్టమేనని సిబ్బంది ఎమ్మెల్యే ముందు వాపోయినట్లు తెలుస్తోంది. అక్రమ వసూళ్లను రాము కీలకపాత్ర పోషిస్తున్నారని, మున్సిపల్ కౌన్సిలర్లు, విలేకర్లకు డబ్బులు ఇవ్వాలని చెప్పి డ్వాక్రా మహిళల నుంచి అక్రమ వసూళ్లకు ప్రోత్సహిస్తున్నారని ఆరోపించినట్లు సమాచారం. సమావేశం అనంతరం ఎమ్మెల్యే శంబంగి మీడియాతో మాట్లాడుతూ అక్రమ వసూళ్లకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. ఆక్రమణలు తొలగింపు వ్యవహారంలో టిపిఒపై కౌన్సిలర్ భర్త చోడిగంజి రాజగోపాల్ వ్యవహారశైలి సరికాదన్నారు.

ఎన్నికలకు పటిష్ట పోలీస్ బందోబస్తు

వంగర: మండలంలోని లక్ష్మీపేట, ఓని అగ్రహారం గ్రామాలలో సర్పంచ్ స్థానాలకు, రుసింగి గ్రామంలో ఒక వార్డు మెంబర్‌కు సంబంధించి శనివారం ఎన్నికలు జరగబోతున్న నేపథ్యంలో ఆయా గ్రామాలలో పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు రాజాం రూరల్ సిఐ హెచ్ ఉపేంద్ర రావు శుక్రవారం తెలిపారు. ఈ మేరకు ఆయన లక్ష్మీ పేటలో పర్యటించి పోలీస్ సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వంగర, రేగిడి మండలాల ఎస్ఐలు ఆర్ జనార్ధన్ రావు, శ్రీనివాసరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

యోగా డిప్లొమో కోర్సు దరఖాస్తులకు గడువు పెంపు

బొబ్బిలి: బొబ్బిలి శ్రీయోగ విద్యా సంస్థలో ఆంధ్రా యూనివర్సిటీ డిప్లమో యోగ కోర్సుకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు పెంచినట్లు యోగ కోర్సు డైరెక్టర్లు ఎంఐవి ప్రసాద్, కె.సత్య ఒక ప్రకటనలో తెలిపారు. బొబ్బిలి ప్రాంతంలో యోగాను అభివృద్ధి చేసేందుకు ఆంధ్రా యూనివర్సిటీ గుర్తింపుతో యోగ డిప్లమో కోర్సు అందుబాటులోకి వచ్చినట్లు చెప్పారు. ఇంటర్మీడియట్ అర్హత ఉన్న వారు డిప్లమో యోగలో చేరేందుకు అర్హులని చెప్పారు. ఆంధ్రా యూనివర్సిటీ వెబ్సైట్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చునని చెప్పారు. ఆసక్తి ఉన్నవారు ఈనెల 28లోగా దరఖాస్తులు చేసుకుంటే 29న కౌన్సిలింగ్ ఉంటుందని చెప్పారు. పూర్తి వివరాలకు 9966229011, 7013969066 నెంబర్లను సంప్రదించాలన్నారు.

న్యాయవాదుల పరిరక్షణ చట్టాన్ని అమోదించాలి

కొత్తవలస: మండల కేంద్రంలో కొత్తవలస మండల న్యాయవాదుల సంఘం (బార్ అసోసియేషన్) ఆధ్వర్యంలో న్యాయవాదుల పరిరక్షణ చట్టం ఆమోదించాలని డిమాండ్‌తో శుక్రవారం ఒకరోజు నిరాహారదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పలరాంప్రసాద్, తెలుగుదేశం పార్టీ శ్రేణులు శిబిరం వద్దకు చేరుకొని న్యాయవాదుల పోరాటానికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశవ్యాప్తంగా న్యాయవాదుల పట్ల జరుగుతున్న దౌర్జన్యం, క్రూరత్వ సంఘటనలు న్యాయవాదులను ఆందోళనకు గురి చేస్తున్నాయన్నారు. న్యాయవాదుల పరిరక్షణ చట్టాన్ని ప్రవేశపెట్టవలసిన అవసరాన్ని ప్రాథమిక లక్ష్యంగా గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు టిడిపి బొబ్బిలి అప్పలాన్నయ్య, కనకల శివ, కోళ్ల శ్రీను, పప్పు అప్పలరాజు, బంగారు రమేష్, లాలం అప్పలరాజు, పాల్గొన్నారు.

కమ్యూనికేషన్ స్కిల్స్‌పై సదస్సు

శృంగవరపు కోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంగ్లీష్ లెక్చరర్ డాక్టర్ సిఎచ్ రవీంద్రనాథ్ కమ్యూనికేషన్ స్కిల్స్‌పై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ కేశవరావు మాట్లాడుతూ యువత ఉపాధి పొందడానికి సాఫ్ట్ స్కిల్స్‌తో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్ కూడా చాలా అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఎస్ఎస్‌డిసి కళాశాల సమన్వయకర్త కె భాస్కరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

విత్తనోత్పత్తిపై రైతులకు శిక్షణ

గజపతినగరం: మండలంలోని కొనిస, కొత్తబగ్గం గ్రామాలలో గ్రామీణ విత్తనోత్పత్తి పథకంలో భాగంగా రైతులకు వ్యవసాయ అధికారి సి.హెచ్ ధనలక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వనరుల కేంద్రం ఎ. గోవిందమ్మ పాల్గొని మాట్లాడుతూ వరి విత్తనోత్పత్తిలో మెళకువలు, ఆకుముడత, పొడతెగులు, కాటుక తెగులు మొదలయిన వాటి యాజమాన్య పద్ధతులు వివరించారు. ఎద వరి, డ్రమ్ సీడర్ ద్వారా విత్తే పద్ధతి ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. కలుపు యాజమాన్య పద్ధతులను వివరించారు. వరిలో కాలి బాటలు తీయడం వల్ల సుడిదోమ ఉధృతిని తగ్గించుకోవచ్చు అని అన్నారు. ఉల్లికోడు నివారణకు కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు లేదా ఫోరేట్ 10జి గుళికలను వాడటం ద్వారా నివారించవచ్చు అని అన్నారు. కాటుక తెగులును ప్రోపికొనజోల్ స్ప్రే చేయడం ద్వారా నివారించవచ్చు అని అన్నారు.

టిపిఒపై అనుచిత వ్యాఖ్యలు దుర్మార్గం

బొబ్బిలి: మున్సిపాలిటీలో పని చేస్తున్న టిపిఒ వరప్రసాద్‌పై వైసిపి కౌన్సిలర్ చోడిగంజి జనసమ్మ భర్త రాజగోపాల్ అనుచిత వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమని మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు శ్రీనాథ్, సురేష్, శివప్రసాద్ అన్నారు. అనుచిత వ్యాఖ్యలను నిరసనగా శుక్రవారం ఉద్యోగులు సమావేశం నిర్వహించి అనుచిత వ్యాఖ్యలను ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జ్యూట్ మిల్లు పక్కన ఆక్రమణలు తొలగిస్తామని చెప్పినప్పటికీ వినకుండా టిపిఒ వరప్రసాద్‌ను దూషించడం అన్యాయమన్నారు. టిపిఒపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రాజగోపాల్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిచో పోరాటం చేస్తామన్నారు.

ఎక్స్‌రే అణు వర్తనాలపై సదస్సు

నెల్లిమర్ల: సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో శుక్రవారం ఎక్సరే కిరణాల వల్ల కలిగే ప్రయోజనాల గురించి అల్ఫా స్కాన్స్ అధినేత డాక్టర్ మక్క రాజశేఖర్ వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ శరీరంలో పక్కు, కీళ్ళు, పళ్ళ క్లీనింగ్, ఎముకల పటుత్వం, ఎముకల కేన్సర్, ఎముకల సాంద్రత వంటి వాటిని ఎక్సరే కిరణాలు ఉపయోగించి తెలుసుకోవచ్చున్నారు. కాగా ఎక్సరే కిరణాల వల్ల హాని కలగకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలిపారు. ఆర్థోపెంటోమోగ్రఫీ ద్వారా దంత పరీక్షలు, జీర్ణకోశ సమస్యలు, యూరినరీ సమస్యలు తెలుసుకోవచ్చున్నారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పి.కె.మహంతి, రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, డీన్ ప్రొఫెసర్ లక్ష్మీ నరసింహ ఆచార్యులు అతిథిని సత్కరించారు.

కెజిబివి పరిశీలన

వేపాడ: మండలంలోని బక్కు నాయుడుపేట వద్ద గల కెజిబివి బాలికల వసతి గృహాన్ని ఎంఇఒ. పి. బాలభాస్కరరావు శుక్రవారం పరిశీలించారు. విద్యార్థులకు ఇస్తున్న మెను వివరాలు, స్టాకు రికార్డులు, వర్క్ బుక్కులు, పాఠశాల ఆవరణను పరిశీలించారు. ఈ పరిశీలనలో ఎస్ఒ కిరణ్మయి పాల్గొన్నారు.

పైపులైన్ లీకులను నివారించాలి

బొబ్బిలి: మున్సిపాలిటీలో పైపులైన్ లీకులను నివారించాలని మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ కోరారు. బిఎస్ఎన్ఎల్ కార్యాలయం సమీపంలో పైపులైన్ లీకులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పైపులైన్ లీకులను నివారించి తాగునీటి వృథాను అరికట్టాలని కోరారు. లీకులతో తాగునీరు వృథాగా పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మున్సిపాలిటీలో లీకులను గుర్తించి నివారించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. చైర్మన్ ఆదేశాలతో పైపులైన్ లీకులను నివారించేందుకు మున్సిపల్ ఇంజినీరింగ్ సిబ్బంది పని చేస్తున్నారు.

మౌలిక సదుపాయాల కల్పన : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతిలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. శుక్రవారం నగర పంచాయతి పరిధి థామస్ పేట 15,16 వార్డుల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వార్డుల్లో పర్యటించి సంక్షేమ పథకాలు అమలు, జరుగుతున్న అభివృద్ధి పనులు స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నగర పంచాయతి అభివృద్ధికి ప్రభుత్వం ప్రాదాన్యత ఇస్తుందన్నారు. వైసిపి పాలనలో సంక్షేమ పథకాలతో బాటు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఛైర్ పర్సన్ బంగారు సరోజినీ, వైస్ ఛైర్మన్లు సముద్రపు రామారావు, కారుకొండ వెంకట కృష్ణారావు, కో ఆప్షన్ సభ్యులు చిక్కాల సాంబశివరావు, జెడ్‌పిటిసి గదల సన్యాసి నాయుడు, టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, కౌన్సిలర్లు మైపాడ ప్రసాద్, మొయిదశ్రీను, పాండ్రంకి సత్యవతి, నాయకులు గంటా అప్పల రాజు, సతీష్, తదితరులు పాల్గొన్నారు.



నెల్లిమర్ల : ప్రభుత్వ పథకాలు గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

బాడంగి : ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి గ్రామాలను అభివృద్ధి చేయడమే సిఎం ఉద్దేశం అని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన్న అప్పలనాయుడు అన్నారు. గురువారం మండలంలోని గూడెపువలస సచివాలయం పరిధి గ్రామాలలో గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా పర్యటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదల అభివృద్ధి కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ఈ ప్రభుత్వం అందిస్తుందన్నారు. తాగు నీటి కోసం ప్రత్యక చర్యలు తీసికోవాలని అధికారులకు ఆదేశించారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందకపోతే వెంటనే సచివాలయం సిబ్బంది తగు చర్యలు తీసికోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు శంబంగి వేణుగోపాల్, శంబంగి శ్రీకాంత్, తెంటు మధు, మరిపి శంకర్, ఎంపిపి గౌరి, జెడ్‌పిటిసి రామారావు, సర్పంచ్ గణేష్ పాల్గొన్నారు.

తప్పుడు రిజిస్ట్రేషన్‌తో హాంఫట్?

ప్రజాశక్తి - జామి

'మాది జామి మండలం, రాంభద్రపురం గ్రామం. నాపేరు తామాడ సంజీవి. గత వందేళ్లుగా మా కుటుంబం నివాసముంటున్న స్థలాన్ని మాకు తెలియకుండా గ్రామ పెద్దగా ఉన్న సర్పంచ్ తప్పుడు రిజిస్ట్రేషన్ చేసుకుని కాజేశారు. 'ఇది గ్రామానికి చెందిన ఒక వ్యక్తి గ్రామ సర్పంచ్ పైనే చేసిన ఫిర్యాదు. గ్రామ ఆస్తులను, ప్రజల యోగక్షేమాలు చూడాల్సిన పెద్దలే ఇలాంటి పనులకు పాల్పడడం ఏంటని ఆవ్యక్తి ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మండలంలోని రామభద్రపురం గ్రామంలోని సర్వే నెంబర్ 61లో తాతల తండ్రుల నుంచి సంజీవి కుటుంభం నివాసముంటుంది. అయితే ఇటీవల గ్రామ సర్పంచ్ పంచాయతీ అధికారులతో కలిసి, గ్రామ కంఠంగా ఉన్న భూమిని రిజిస్ట్రేషన్ చేసుకున్నారని ఇటీవల జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై ఇఒపిఆర్‌డిని విచారణకు ఆదేశించినట్లు తెలిసింది. ఒక్క రామభద్రపురం



ఈ స్థలాన్నే రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు..

గ్రామంలోనే కాదు మండలంలో అనేక గ్రామాల్లో గ్రామ పెద్దలుగా ఉన్న ప్రజాప్రతినిధులు చేస్తున్న అక్రమాలు అనేకం. ఈ నేపథ్యంలోనే అధికారులు సమగ్ర విచారణ చేపట్టి, పారదర్శకంగా చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

స్పందనలో ఫిర్యాదు వచ్చింది

భూ రిజిస్ట్రేషన్ పై స్పందన ఫిర్యాదు రావడం వాస్తవమే. దీనిపై ఇంచార్జి ఇఒపిఆర్‌డి విచారణ చేస్తున్నారు. త్వరలోనే నివేదిక ఆధారంగా ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

ఎం.సతీష్, ఎంపిడిఒ, జామి

సింగవరం సచివాలయ సందర్శన

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని సింగవరం గ్రామంలో నిర్మాణంలో ఉన్న సచివాలయాన్ని స్పెషల్ చీఫ్ సెక్రటరీ, పిఆర్ అండ్ ఆర్‌డి బి రాజశేఖర్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణంలో ఉన్న సచివాలయాన్ని పరిశీలించి నాణ్యమైన మెటీరియల్ వాడుతున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. వాటికి వాడే డోర్లు మిగిలిన మెటీరియల్ అన్ని క్వాలిటీవి వేయాలని సూచించారు. ఇంజనీరింగ్ అధికారులకు నిర్మాణంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు చేయాల్సిన పనులు గురించి సూచనలు సలహాలు అందించారు. జెజెఎం పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఆర్‌బికె, వెల్నెస్ సెంటర్లను పరిశీలించి పురోగతిని అడిగి తెలుసుకున్నారు. సచివాలయంలో సిబ్బంది ప్రజలకు అందుతున్న సేవలు గురించి అడిగారు. రికార్డులను పరిశీలించారు. సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి వారికి కావలసిన సేవలు అందించాలని ఆదేశించారు. ఆయన వెంట సర్పంచ్ అప్పారావు, ఎంపిడిఒ డిడి స్వరూప రాణి, ఎఒ ఎం నిర్మల పలు శాఖలు అధికారులు ఉన్నారు.



పనులను పరిశీలిస్తున్న స్పెషల్ చీఫ్ సెక్రటరీ

జగనన్న ఇల్లు కొన్నా.. అమ్మినా కేసులే

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మండలంలోని జగనన్న కాలనీలలో పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలు లబ్ధిదారులు అమ్మినా, ఎవరైనా కొన్నా వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తహశీల్దార్ శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిపి సండి మేశ్వరరావు అధ్యక్షతన శుక్రవారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జగనన్న ఇళ్ల స్థలాలను లబ్ధిదారులు అమ్ముకుంటున్నారంటూ పలువు సర్పంచులు తహశీల్దార్‌కు ఫిర్యాదు చేయటంతో ఎవరైనా లబ్ధిదారుడు ఇళ్ల స్థలం అమ్మినట్లు నిరూపిస్తే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తానని హామీ ఇచ్చారు. చామలాపల్లి సర్పంచ్ సూర్యారావు మాట్లాడుతూ తమ గ్రామంలో హౌసింగ్ స్కీం కింద నిర్మించిన ఇళ్లకు బిల్లులు

మండల సమావేశంలో తహశీల్దార్

వచ్చే సమయంలో కొంతమంది లబ్దిదారులను బెదిరించి మరి డబ్బులు వసూలు చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. హౌసింగ్ ఎఇ మాట్లాడుతూ ఎవరైనా సొంత స్థలం కలిగిన లబ్దిదారులు ఇల్లు నిర్మించుకోవాలంటే దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఎలక్ట్రికల్ ఎఇ రవికుమార్ మాట్లాడుతూ మండలానికి అదనంగా రెండు సబ్ స్టేషన్లు మంజూరయ్యాయని పట్టణంలో ఒకటి మండలంలోని జెడ్ కుమరం వద్ద ఒకటి నిర్మించాలని వాటికి తహశీల్దార్ ప్రభుత్వ స్థలాలు పరిశీలించి అప్పగించాలని కోరారు. ఈ సమావేశంలో వైస్ ఎంపిపి ఇందుకూరి సుబ్బలక్ష్మి, జెడ్‌పిటిసి వెంకటలక్ష్మి, ఎంపిడిఒ శేషుబాబు, సర్పంచులు, ఎంపిటిసిలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

టిడిపి గెలుపునకు కృషి

ప్రజాశక్తి - కొత్తవలస

మనమంతా టిడిపి గెలుపు కషి చేయాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ అన్నారు. మండల కేంద్రంలో టిడిపి మండల అధ్యక్షులు గొరపల్లి రాము అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పార్టీ గెలుపునకు మనం కీలకం కావాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో మనమంతా కలిసి తెలుగు దేశం పార్టీ గెలుపునకు కృషి చేయాలన్నారు. రాష్ట్రంలో నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితేనే తప్ప రాష్ట్రం బాగుపడదని అన్నారు. రాష్ట్ర ప్రజలకు ఎటువంటి ఆటంకం లేకుండా పరిపాలిస్తూ, పోలవరం ప్రాజెక్టుకు సంబంధించిన నిధులు సేకరించి 80 శాతం పోలవరం ప్రాజెక్ట పనులు పూర్తి చేసిన ఘనత చంద్రబాబుదే అని అన్నారు. ఈ సమావేశంలో జామి మాజి జెడ్‌పిటిసి బండారు పెదబాబు, ఆలుగుబిల్లి శేఖర్, జామి మండలపార్టి అధ్యక్షులు లగుడు రవికుమార్, జాగరం పైడిబాబు, టిడిపి పార్లమెంటు ఉపాధ్యక్షులు లెంక శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రవిబాబుకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్సీ

ప్రజాశక్తి- శృంగవరపుకోట

ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వంచే గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికైన రాష్ట్ర ఎస్‌టి కమిషన్ మాజీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే కుంభా రవిబాబు శుక్రవారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వేపాడ ఎంపిపి దొగ్గ సత్యవంతుడు, మండల పార్టీ అధ్యక్షులు ఎమ్. జగన్నాథం, పలువురు సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు

ఎండిఎం నిర్వాహకులను పనిలోకి తీసుకోవాలి

ప్రజాశక్తి - బొబ్బిలి రూరల్

అలజంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న మధ్యాన్న భోజన నిర్వాకురాల్ని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని పాఠశాల వద్ద సిఐటియు ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు పి. శంకర్రావు మాట్లాడుతూ అలజంగి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల భోజన నిర్వాహకరాలు పొట్నూరు సత్యవతిని రాజకీయ కారణాలతో తొలగించడం అన్యాయమన్నారు. పాఠశాలలో గత 16 సంవత్సరాల నుండి జీతం లేకపోయినా ఉచితంగా పనిచేసిన సత్యవతిని తొలగించడం అన్యాయమని కనీస వేతనం లేకపోయినా మెను చార్జీలు పెంచకపోయినా మధ్యాహ్న భోజనం నిర్వాహకులు అప్పులు చేసి మధ్యాహ్నం భోజనం నిర్వహణ కొనసాగిస్తున్నారని అన్నారు. పొట్నూరి సత్యవతిని తొలగించడానికి త్రీ మాన్ కమిటీ వేసి మరీ తొలగించడం బాధాకరమన్నారు. నియోజకవర్గంలో అనేక సమస్యలు ఉన్నాయని, రైతులు, కార్మికులు, ప్రజలు చాలా సమస్యలు



నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు

ఎదుర్కొంటున్నారని ఆ సమస్యలు పరిష్కారం చూపించలేని ఎమ్మెల్యే ఒక మధ్యాహ్నం భోజనం నిర్వాహకురాలను తొలగించడానికి పూనుకోవడం సిగ్గుచేటన్నారు. ఆమెకు పని వెంటనే ఇవ్వాలని లేని పక్షంలో మండలమంతా మధ్యాహ్నం భోజనం బంద్ చేసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమంలో మధ్యాహ్నం భోజనం మండల ప్రెసిడెంట్ రామలక్ష్మి, ఉపాధ్యక్షులు డి. ఆదిలక్ష్మి చంద్రమ్మ పాల్గొన్నారు.

వివాదాస్పద భూముల పరిశీలన

వేపాడ: మండలంలోని వీలుపర్తి రెవెన్యూ పరిధిలో వివాదస్పద భూములను సిఐ బాలసూర్యారావు శుక్రవారం పరిశీలించారు. ఇక్కడ డీ పట్టా భూములను లీజు రూపంలో ఐదు సంవత్సరాలకు గోదావరి జిల్లాకు చెందిన బోసురాజు 2016లో రైతులు వద్ద నుంచి తీసుకున్నాడు. ఈ లీజు గడువు 2022తో ముగిసినప్పటికి తమ భూములు తమకు ఇవ్వకుండా ఎన్నిసార్లు అడిగినా నెల రోజులు టైం ఇవ్వండి అంటూ తమపై తప్పుడు కేసులు పెట్టి ఇబ్బంది పెడుతున్నాడని రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సిఐ బాలసూర్యరావు ఈ భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం ఎమ్మార్వో కార్యాలయ వద్దకు బోసు రాజును పిలిపిస్తామని రైతులు కూడా రావాలని తెలిపారు. దీనికి తాము తప్పనిసరిగా వస్తామని రైతులు గోకాడ భూషణం, సావిత్రి, అచ్చి బాబు తదితరులు వివరించారు.



రైతులతో మాట్లాడుతున్న సిఐ బాలసూర్యారావు

గ్రానైట్ పలకల ధ్వంసంపై ఫిర్యాదు

ప్రజాశక్తి - జామి

మండలంలోని చింతాడ గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇంటి గ్రానైట్ పలకలను గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు ధ్వంసం చేశారని గ్రామానికి చెందిన ద్వారపూడి మహేశ్వరరావు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై స్థానిక ఎస్ఐ వీరబాబు వివరాల ప్రకారం... చింతాడ గ్రామంలోని మహేశ్వరరావు ఇటీవల సొంతింటిని నిర్మించుకుంటున్నారు. నిర్మాణంలో భాగంగా ఇంటి ఫ్లోరింగ్ కోసం గ్రానైట్ పలకలు కొనుగోలు చేసుకుని, నిర్మాణంలో ఉన్న ఇంటి వద్ద భద్రపరిచాడు. ఇటీవల గ్రామానికి చెందిన గుమ్మడి కృష్ణ, నక్క శివ, కిలారి పృథ్వి అనే ముగ్గురు వ్యక్తులు ఉద్దేశ పూర్వకంగా వాటిని ధ్వంసం చేశారని మహేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై విచారణ చేపడుతున్నామని బాధితులకు రిసిప్ట్ ఇచ్చామని చెప్పారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

25న సభను విజయవంతం చేయండి

ప్రజాశక్తి- విజయనగరం

1993కు ముందున్న వారిని సీనియర్టీ ప్రాతిపదికన ఎన్ఎంఆర్ డైలీ వైజ్, పార్ట్ టైం, ఫుల్ టైమ్‌లో మినిమమ్ టైమ్ స్కేలు తీసుకుంటున్న ఉద్యోగులందరనీ రెగ్యులర్ చేయాలని ఈ నెల 25న విజయవాడ ధర్నా చౌక్ వద్ద నిర్వహించనున్న 'సిఎంను వేడుకోలు సభ'ను విజయవంతం చేయాలని ఎన్ఎంఆర్ మినిమమ్ టైమ్ స్కేల్, కన్సల్టేటెడ్ పే, పార్ట్, ఫుల్ టైమ్ ఎంప్లాయిస్ యూనియన్ జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా నాయకులు బి. శంకరరావు, రెడ్డి రాంబాబు, బి. గాంధీ కోరారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టర్ కార్యాలయం వద్ద సభకు సంబంధించిన పోస్టర్, కరపత్రం విడుదల చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ గ్రీవెన్సులో సీనియర్టీ ప్రాతిపదికన రెగ్యులర్ చేయాలని కోరుతూ కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిహెచ్ అప్పారావు, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు